క్లుప్తంగా

బాలుడి వైద్యఖర్చులకు ఆర్థిక సహాయం



చిలకలూరిపేట: పట్టణంలోని 11వ వార్డు రూత్‌డై క్మెన్ కాలనీకి చెందిన నిరుపేద దంపతులైన సుధీర్, అనూషల మూడేళ్ల కుమారుడు బిన్నీ పాల్ తీవ్ర అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. ఈ విషయం స్థానిక వైఎస్సార్ సీపీ నాయకుల ద్వారా పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త మల్లెల రాజేష్‌నాయుడు దృష్టికి వచ్చింది. స్పందించిన ఆయన బాలుడి వైద్య ఖర్చుల నిమిత్తం రూ. 10 వేలు ఆర్థిక సహాయాన్ని పట్టణంలోని బ్యాంకు కాలనీలో ఉన్న వైఎస్సార్ సీపీ కార్యాలయంలో బాలుడి తల్లిదండ్రులకు సోమవారం అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు గుంజి వీరాంజనేయులు, మానుకొండ శేషిరెడ్డి, జైనాబి పాల్గొన్నారు.

రొంపిచర్ల ఎంపీడీవోగా లక్ష్మీకుమారి



రొంపిచర్ల: స్థానిక మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా సీహెచ్ లక్ష్మీకుమారి సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఆమె కార్యాలయంలోనే ఏవోగా పనిచేస్తూ ఎఫ్ఏసీగా బాధ్యతలు తీసుకున్నారు. ఎండీవోగా బాధ్యతలు చేపట్టిన ఎంపీపీ గడ్డం బాలనాగమ్మ వెంకట్రావు, కార్యాలయ అధికారులు, సిబ్బంది అభినందనలు తెలియజేశారు. ఇప్పటి వరకు ఎండీవోగా పనిచేసిన మాధ్యూబాబు బదిలీ అవ్వటంతో ఈమె నియామకం అవసరమాఐందిది.

విద్యార్థులకు అవగాహన సదస్సు

శావల్యాపురం: మండలంలోని కనమర్లపూడి గ్రామం సమీపంలో ఉన్న సంసిద్ స్కూలులో జాతీయ రహదారి భద్రతా వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు ట్రాఫిక్ అవగాహన సదస్సు నిర్వహించినట్లు ఎస్సై చల్లా సురేష్ సోమవారం తెలిపారు. ఈసందర్భంగా ఎస్సై మాట్లాడుతూ మైనరు బాలురు వాహనాలు నడపటం చట్టారీత్యా నేరమన్నారు. ద్విచక్ర వాహనాలు నడిపే వారందరూ హెల్మెట్ ధరించాలన్నారు. విద్యార్థులు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్గియుండాలన్నారు. వాహనాలు నడిపే సమయంలో తప్పనిసరిగా సీటు బెల్ట్ ధరించాలన్నారు. అలాగే ప్రభుత్వ నిబంధనల మేరకు డ్రైవింగ్ లైసెన్స్ కల్గియుండాలన్నారు. ఆయనతో పాటు పాఠశాల ప్రిన్సిపాల్ జమీర్ ఉన్నారు.

నందికుంట విఘ్నేశ్వరుడికి రూ.1,99,482లు ఆదాయం

నాదెండ్ల: గణపవరం-నాదెండ్ల డొంక రోడ్డులో కొలువైయున్న చారిత్రాత్మక శ్రీ నందికుంట విఘ్నేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఆలయానికి రూ.1,99,482లు ఆదాయం లభించింది. ఈ మేరకు సోమవారం దేవాదాయ ధర్మాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ మంజూష, ఈవో ఎస్ తులశీదాస్, గ్రామ పెద్దల సహకారంతో హుండీ విరాళాలు లెక్కించారు. హుండీ ఆదాయం రూ.74,850లు కాగా, విరాళాల రూపంలో రూ.1,24,632లు జమ అయ్యాయి. గతేడాది కన్నా ఈ ఏడాది ఆదాయం పెరిగినట్లు ఈవో ఎస్.తులసీదాస్ తెలిపారు. ఆదివారం జరిగిన వార్షికోత్సవం సందర్భంగా భక్తులు భారీగా హాజరై స్వామిని దర్శించుకుని అన్నప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమం విజయవంతానికి సహకరించిన సేవా సమితి సభ్యులు, గ్రామ పెద్దలకు దేవదాయశాఖ అధికారులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పర్చూరి కృష్ణారావు, కాట్రగడ్డ సుబ్బారావు, శివ కామేశ్వరరావు, కోనేటి నాగేశ్వరరావు, గంగినేని అప్పారావు, గుడికందుల యల్లారావు, నల్లమోతు హరిబాబు ఉన్నారు.

నేడు వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమావేశం

నరసరావుపేట: స్థానిక ప్రకాషనగర్‌లోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మంగళవారం ఉదయం 11గంటలకు నియోజకవర్గ స్థాయి పార్టీ విస్తృత సమావేశం ఏర్పాటు చేసినట్లు ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి సోమవారం పేర్కొన్నారు. పార్టీకి చెందిన వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, డైరెక్టర్లు, జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, సర్పంచులు, మాజీ కౌన్సిలర్లు, గృహసారథుల కన్వీనర్లు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

పోలింగ్ కేంద్రాలు పరిశీలించిన తహసీల్దార్

నాదెండ్ల: త్వరలో జరిగే సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మండలంలో 57 పోలింగ్ కేంద్రాలు ఉండగా, అప్పాపురం, నాదెండ్ల గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ డీవీబీ వరకుమార్ సందర్శించారు. అప్పాపురంలో 2, నాదెండ్లలో ఏడు కేంద్రాలు పరిశీలించి, విద్యుత్, తాగునీరు, ర్యాంపు తదితర ఏర్పాట్లు పరిశీలించారు. వీఆర్వోలతో మాట్లాడారు. స్థానికుల నుంచి ఎలాంటి ఫిర్యాదులున్నా తీసుకోవాలని కోరారు. ఆయనతో పాటూ ఆర్ఐ రమీజా, వీఆర్వోలు రాము, ఆనంద్, డి.కోటిరాము, ఎం.నాగరాజు ఉన్నారు.

జగనన్న హయాంలోనే సంక్షేమ కుటుంబాలు

- రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూర్చిన ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానిదే
- ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

వినుకొండ(నూజెండ్ల): రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందించిన ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానిదే అని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మ నాయుడు అన్నారు. మండలంలోని పిట్టంబండ గ్రామంలో గ్రామ సచివాలయం, వైఎస్సార్ రైతు భరోసా కేంద్రం, వైఎస్సార్ హెల్త్ సెంటర్ నూతన భవనాలను ఆయన సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ హయాంలో ప్రతీ గ్రామం అభివృద్ధి పథంలో ముందుకెళ్తుందన్నారు.

ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి గ్రామ పరిపాలన వ్యవస్థను తీసుకొచ్చి 1.30 లక్షలకు పైగా ఉద్యోగాలను కల్పించారన్నా రు. వలంటీర్ల వ్యవస్థ ద్వారా ప్రతి ఒక్కరికీ నవరత్న పథకాలు అందాలని నేరుగా వారి ఖాతాల్లోకే డబ్బులను జమ చేస్తున్నామన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రతి గ్రామంలో రైతు భరోసా కేంద్రాలు, సచివాలయాలు, విలేజ్ హెల్త్ క్లినిక్ వంటి పక్కా భవనాల ను నిర్మించి వాటి ద్వారా ప్రజలకు సేవలు అందిస్తున్నారన్నారు. నేడు ఏ పని కావాలన్నా ప్రజలు తమ గ్రామంలోనే చేయించుకోవచ్చని, ఒకప్పుడు రైతు విత్తనాల కోసం, ఎరువుల కోసం కిలోమీటర్ల కొద్ది పోవాల్సి వచ్చేదని, ప్రస్తుతం గ్రామంలోనే ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంటున్నాయని ఆయన అన్నారు. సంక్షేమాన్ని, అభివృద్ధిని ప్రజలు గమనించి జగనన్నకే మళ్లీ పూర్తిస్థాయిలో మద్దతు తెలపాలని కోరారు. పదేళ్లు ఎమ్మెల్యేగా ఉన్న జీవీ ఆంజనేయులు నియోజకవర్గ ప్రజలకు చేసిందేమీ లేదని, పదవిని తన స్వార్థానికి వినియోగించుకున్నారని విమర్శించారు. మట్టికి రంగులు వేసి బయో ఎరువులు అంటూ రైతులకు కట్టబెడుతూ వారిని మోసం చేస్తున్నారన్నారు. టీడీపీ హయాంలో జన్మభూమి కమిటీల పేరుతో ముఖాలు చూసి సంక్షేమం అందజేసి అర్హులకు అన్యాయం చేశారన్నారు.

నేడు ఆ పరిస్థితి లేకుండా నేరుగా లబ్ధిదారుని ఖాతాల్లోకే సంక్షేమ నగ దును ప్రభుత్వం అందజేస్తుందని గుర్తు చేశారు. పేద ప్రజల అభ్యున్నతి కోసం కృషి చేస్తుంటే అబద్ధపు ప్రచారంతో బురద చల్లే ప్రయత్నాలు చేస్తున్నారని అన్నారు. రానున్న ఎన్నికల్లో పెత్తందారులకు పేద ప్రజలకు యుద్ధం జరుగుతోందని, ఆ యుద్ధంలో ప్రజలు మంచి వైపు అడుగులు వేయాలని కోరారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్ బత్తుల చిన్నబ్బాయి, మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ దండు చెన్నయ్య, ఎంపీపీ జయశ్రీ వెంకట రామిరెడ్డి, జెడ్పీటీసీ విజయలక్ష్మి రాజా, సర్పంచ్ ఆర్.సుభాన్ సింగ్, ఎంపీటీసీ ఉగ్రావ్ సింగ్, ఉప సర్పంచ్ వెంకటేశ్వరరావు, బాలాజీ సింగ్, మాజీ సర్పంచ్ రామాంజనేయులు, వెంకట్రావు, సుబ్బారావు, అర్టిటీ శివ, నరేంద్ర, రామ్‌సింగ్ పాల్గొన్నారు.



పిట్టంబండ సచివాలయ ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు



ఏనుగుపాలెంలో సురక్షిత మంచినీటి పథకం నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే

వేర్వేరు గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలు

వినుకొండ మండలంలోని ఏనుగుపాలెం గ్రామంలో జలజీవన్ మిషన్ కింద రూ.75 లక్షల వ్యయంతో సురక్షిత మంచినీటి పథకం కుళాయి కనెక్షల నిర్మాణ పనులకు ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు శంకుస్థాపన చేశారు. అదేవిధంగా మండలంలోని వెంకుపాలెం గ్రామంలో గ్రామపంచాయతీ భవనం నిర్మాణానికి ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మ నాయుడు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రతి ఇంటికి తాగునీరు అందించేందుకు జలజీవన్ మిషన్ పథకం కింద పైపులైన్, ఇంటింటికీ కుళా యిలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. రానున్న రోజుల్లో వాటర్ గ్రిడ్ నుంచి అన్ని గ్రామాలకు తాగునీరు అందిస్తామన్నారు. కార్యక్రమంలో వెంకుపాలెం సర్పంచ్ కంచర్ల ఏడుకొండలు, మునె మ్మ, యలగాల బ్రహ్మయ్య, రాజా కోటేశ్వరరావు, గుమ్మా శ్రీను, మరియమ్మ పాల్గొన్నారు.

టీడీపీని వీడి.. వైఎస్సార్ సీపీలో చేరి..



వైఎస్సార్ సీపీలో చేరిన వారితో మల్లెల రాజేష్‌నాయుడు

సాదరంగా ఆహ్వానించిన వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మల్లెల రాజేష్‌నాయుడు

చిలకలూరిపేట: టీడీపీది ముగిసిన అధ్యాయమని, అందుకే ఆ పార్టీకి చెందిన వారు వైఎస్సార్ సీపీలోకి చేరుతున్నారని పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త మల్లెల రాజేష్ నాయుడు చెప్పారు. పట్టణంలోని రూత్‌డైక్‌మెన్ కాలనీలోని టీడీపీకి చెందిన 10 కుటుంబాల వారు ఆ పార్టీని వీడి వైఎస్సార్ సీపీ నాయకులు మానుకొండ శేషిరెడ్డి, గుంజి వీరాంజనేయులు ఆధ్వర్యంలో పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త మల్లెల రాజేష్ నాయుడు సమక్షంలో సోమవారం వైఎస్సార్‌సీపీలో చేరారు. పట్టణంలోని బ్యాంకు కాలనీలో ఉన్న వైఎస్సార్ సీపీ కార్యాలయంలో వారికి మల్లెల రాజేష్ నాయుడు వైఎస్సార్ సీపీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని కోరారు.

టీడీపీ దౌర్జన్యాలు భరించలేక...

ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీలో చేరిన వేముల నాగరాజు మాట్లాడుతూ టీడీపీ నాయకులు దౌర్జన్యాలు, కబ్జాలు భరించలేక తాము టీడీపీని వీడి వైఎస్సార్ సీపీలో చేరినట్లు పేర్కొన్నారు. తమకు చెందిన భూమికి సంబంధించి మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు అనుచరుడు ప్రతాప్ ఫోర్జరీ సంతకాలతో పట్టాలు సృష్టించి తమపై దౌర్జన్యానికి పాల్పడ్డాడని వాపోయాడు. స్థలంలోకి వస్తే ఊరుకోనని ప్రతాప్ బెదిరించటంతో పోలీసులను ఆశ్రయించినట్లు పేర్కొన్నారు. పోలీసులు తహసీల్దార్‌కు విషయాన్ని నివేదించగా, ఆ భూమి మా స్వాధీనంలో ఉన్నట్లు తేల్చారని, సామాన్య ప్రజలకు టీడీపీలో న్యాయం జరగదని వెల్లడించాడు. దీనికి తోడు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పేదల పట్ల చూపుతున్న ఆదరణ నచ్చి తామంతా వైఎస్సార్ సీపీలో చేరినట్లు తెలిపారు. వైఎస్సార్ సీపీలో చేరిన వారిలో వేముల నాగరాజు, కోటేశ్వరరావు, వేముల మల్లేశ్వరి, భూపతి రాజు, వేముల రాజ్యలక్ష్మి, రమాదేవి, తాండవకృష్ణ, గుంజి కుమారి కుటుంబ సభ్యులు ఉన్నారు.

రేపు చిరుమామిళ్లలో ఆలయాల వార్షికోత్సవం

నాదెండ్ల: చిరుమామిళ్ల గ్రామంలో కొలువైయున్న శ్రీ కళ్యాణ వెంకటేశ్వర స్వామి, కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయాల వార్షికోత్సవం నిర్వహిస్తున్నట్లు గ్రామ కమిటీ సభ్యులు తెలిపారు. గ్రామానికి చెందిన గోల్కొండ గ్రూపు సంస్థల అధినేత నడికట్టు రామిరెడ్డి 2005లో స్వంత నిధులతో నిర్మించిన విషయం విదితమే. నడికట్టురామిరెడ్డి ఎస్టీ కాలనీలో కాశీవిశ్వేశ్వర స్వామి దేవాలయం నిర్మించి ఆలయం సమీపంలోనే మరో 11 మందికి ఇళ్ల స్థలాలు, గృహాలు నిర్మించి ఇచ్చారు. బుధవారం ఈ ఆలయాల వార్షికోత్సవం నిర్వహించనున్నారు. ముందుగా ఉదయం స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజల అనంతరం నడికట్టు రామిరెడ్డి సేవా సమితి ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించనున్నారు.



చిరుమామిళ్ళ కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయం

108 అంబులెన్స్ సిబ్బందికి వసతి గృహం, పార్కింగ్ సౌకర్యం

సత్తెనపల్లి: కరోనా సమయంలో 108 వాహన సిబ్బంది ఎంతో కీలక పాత్ర పోషించారని, ప్రాణాలను సైతం లెక్కచేయకుండా విధులు నిర్వహించి, ఎన్నో ప్రాణాలు కాపాడారని వారికి వసతి గృహం కల్పించడం అదృష్టంగా భావిస్తున్నానని సత్తెనపల్లి ఏరియా వైద్యశాల అభివృద్ధి కమిటీ డైరెక్టర్ కొత్త రామకృష్ణ అన్నారు. పట్టణంలో 108 అంబులెన్స్‌లకు పార్కింగ్ సౌకర్యం, సిబ్బందికి వసతి గృహాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ మంత్రి అంబటి రాంబాబు, జిల్లా కలెక్టర్ లోతేటి శివ శంకర్ సహకారంతో వసతి గృహాన్ని అందించామన్నారు. అంబులెన్స్ పైలెట్ కిరణ్ మాట్లాడుతూ సత్తెనపల్లి ఏరియా వైద్యశాల పరిధిలో గత ఎనిమిదేళ్లుగా పని చేస్తున్నామని, వసతి సదుపాయం కావాలని కొన్ని సంవత్సరాలుగా అధికారులు అడుగుతున్నామన్నారు. కొత్త రామకృష్ణను సంప్రదించగానే తమ బాధలను అర్థం చేసుకొని వెంటనే వసతి గృహం, పార్కింగ్ స్థలం కల్పించారని సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పైలట్ వెంకటేష్, టెక్నీషియన్స్ సురేష్, కోటయ్య, తదితరులు ఉన్నారు.



వసతి గృహాన్ని ప్రారంభిస్తున్న కొత్త రామకృష్ణ

భక్తుల సౌకర్యాల కల్పనకు సమష్టిగా కృషిచేద్దాం

సత్రశాల(రెంటచింతల): మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని మండలంలోని సత్రశాల వద్ద వేంచేసిన శ్రీ గంగా భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి దేవస్థానం సందర్శించే భక్తులకు సేవ చేసేందుకు సమష్టిగా కృషి చేద్దామని దేవస్థానం చైర్మన్ బద్దూరి బ్రహ్మారెడ్డి అన్నారు. సోమవారం దేవస్థానం కార్యాలయంలో ఈవో బి.నెమిలిరెడ్డి, కార్యవర్గ సభ్యులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. స్వామివారి దర్శనానికి వచ్చే ప్రతి భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూడాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. క్షేత్రస్థాయి సిబ్బంది సమన్వయంతో పనిచేసినప్పుడే ఏర్పాట్లు సక్రమంగా నిర్వహించగలుగుతామన్నారు. వాహనాల పార్కింగ్ స్థలాన్ని అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. కృష్ణానదిలో స్నానాలు చేసే సమయంలో గజ ఈతగాళ్లను ఏర్పాటు చేయాలన్నారు. దేవస్థానం పరిధిలో నున్న అన్నదాన సత్రాల నిర్వాహకులు అధికారులకు సహకరించాలన్నారు. భక్తులకు ప్రశాంతంగా దైవ దర్శనం చేసుకునేలా బారికేడ్లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో జెట్టిపాలెం సర్పంచ్ దావులూరి నాగమ్మ, మాజీ వైస్ చైర్మన్ బాపనపల్లి శ్రీనివాసరావు, కార్యవర్గ సభ్యులు యు.పద్మావతి, జి.పెదసైదులు, ఎ.నర్సింహారెడ్డి, డి.కమలమ్మ, ఎం.కొండానాయక్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న దేవస్థానం చైర్మన్ బద్దూరి బ్రహ్మారెడ్డి

పండ్ల తోటల పెంపకంపై అవగాహన సదస్సు

రెంటచింతల: పండ్ల తోటలను సాగుచేసే రైతులకు పండ్ల మొక్కల పెంపకంపై అవగాహన ఎంతో అవసరమని ఉద్యాన శాఖ సహాయ అధికారి ఎస్‌కే హాజరా అన్నారు. సోమవారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సర్పంచ్‌లు, కార్యదర్శులు, వ్యవసాయ, ఉద్యాన శాఖల సహాయకులకు, సచివాలయ సిబ్బందికి, ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్‌లకు ఎంపీడీఓ పెదప్రోలు శంకర్‌రావు అధ్యక్షతన నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. ఉపాధి నిధులతో 100 శాతం రాయితీతో పండ్ల పెంపకానికి ప్రోత్సాహకాలు ఇవ్వడం జరుగుతుందన్నారు. పండ్ల మొక్కల పెంపకంపై అవగాహన కల్పించారు. గతంలో ఎకరాకు కేవలం 40 నుంచి 60 మొక్కలు మాత్రమే పెంపకం ఉండేదన్నారు. కొత్త తరహాలో మామిడి తోటలను అత్యధిక సాంద్రతలో సాగు చేస్తున్నట్లు ఈ తరహాలో ఎకరాకు 520 మొక్కలను పెంచడం జరుగుతుందన్నారు. దీంతో మంచి దిగుబడి వస్తుందన్నారు. పండ్ల మొక్కలకు వచ్చే వివిధ రకాల తెగుళ్ల వాటి నివారణకు తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలను వివరించారు. అధికారుల సూచనలతో పండ్ల మొక్కలను పెంచి అధిక దిగుబడులను సాధించి మంచి ఆదాయం పొందవచ్చన్నారు. ఉపాధిహామీ పథకం కింద పండ్ల తోటల పెంపకానికి దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, రైతులతో పాటు రెండున్నర ఎకరాల మాగాణి ఉన్న వారు, 5 ఎకరాలు మెట్ట పొలం ఉన్న చిన్న, సన్నకారు రైతులు నీటి వసతి ఉన్నవారు, బోరు బావి కలిగిన వారు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. వివిధ పండ్ల మొక్కలను అందజేస్తామన్నారు. దరఖాస్తు చేసుకోనే రైతులు పట్టాదారు పాస్ పుస్తకం నకలు, అడంగల్, వన్ బి, సన్న, చిన్న కారు రైతు సర్టిఫికెట్, ఆధార్ కార్డ్ నకలు, రేషన్‌కార్డ్ నకలు, ఉపాధి జాబ్ కార్డ్ నకలుతో పాటు పాస్‌పోర్ట్ ఫొటో తమ కార్యాలయంలో అందజేయాలన్నారు. ఈ సమావేశంలో ఏపీవో జి.జయచంద్రకుమార్, ఈసీ నాగరాజు పాల్గొన్నారు.



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఉద్యానశాఖ సహాయ అధికారి ఎస్‌కే హాజరా

వృద్ధులకు నిత్యావసరాలు అందజేత

మాచర్ల రూరల్: మండలంలోని భైరవునిపాడు గ్రామంలో పవర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అనాథ వృద్ధులకు నిత్యావసర సరుకులను సోమవారం పంపిణీ చేశారు. అనాథలను, వృద్ధులను, చిన్నారులను ఆర్థికంగా ఆదుకునేందుకు పవర్ ఫౌండేషన్ సంస్థ ద్వారా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు అధ్యక్షులు, న్యాయవాది జి.జె.రావు తెలిపారు. కన్వీనర్ యరగొర్ల సాంబశివరావు యాదవ్, గురజాడ అప్పారావు చారి, జి.రాజు, దశరథ్ పాల్గొన్నారు.

దరఖాస్తుల విచారణ నిష్పక్షపాతంగా చేయండి



బొల్లాపల్లి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో తహసీల్దార్ బీవీ రమణారావు అధ్యక్షతన బూత్ లెవెల్ అధికారుల సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ బీఎల్ఓలకు పలు సూచనలు చేశారు. ఓటర్లు నుంచి దాఖలైన ఫారం 6,7,8లు విచారించి త్వరగా తహసీల్దార్ కార్యాలయంలో అందజేయాలని తెలిపారు. పారదర్శకంగా, నిష్పక్షపాతం విచారణ చేపట్టాలని, ఓటర్లు దఖలైన దరఖాస్తులకు సంబంధించి తగిన ఆధారాలు పొందుపరచి పరిశీలన చేయాలని, నమోదులు, తొలగింపులు, మార్పులు, వంటి ఓటరు దరఖాస్తుల విషయంలో జాగ్రత్తలు పాటించాలని తహసీల్దార్ సూచించారు.

మృతుడి కుటుంబానికి మంత్రి పరామర్శ

సత్తెనపల్లి: గర్నెపూడి గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు కాశీమాల మరియదాస్ కుమారుడు సంగీతరావు (35) అనారోగ్యంతో గత నెల 29న మృతి చెందాడు. కొన్ని పరిస్థితుల వల్ల రాలేని పక్షాన సోమవారం గర్నెపూడి గ్రామాన్ని రాష్ట్ర జలవనరుల శాఖా మంత్రి అంబటి రాంబాబు సందర్శించి, సంగీతరావు కుటుంబ సభ్యులను పరామర్శించారు. సంగీతరావు చిత్రపటానికి పూలమాలలు నివాళులర్పించారు. మృతుడి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం మాజీ ఎంపీటీసీ కాశిమాల ఓబయ్య గృహాన్ని సందర్శించి, గ్రామంలోని సమస్యలను తెలుసుకున్నారు. ప్రాధాన్యతా క్రమంలో ఆయా సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తానన్నారు. ఆయన వెంట మార్కెట్ యార్డ్ చైర్మన్ పెండెం బాబురావు, మాజీ చైర్మన్ రాయపాటి పురుషోత్తమరావు, వ్యవసాయ సలహా మండలి రాష్ట్ర సభ్యుడు కళ్ళం విజయభాస్కర్ రెడ్డి, సర్పంచ్ గుగిలం అంకమ్మ, కాశిమాల ఓబయ్య, కాశిమాల మార్కు, బి. రవి ఉన్నారు.

పూర్వ విద్యార్థుల సేవా గుణం

మాచర్ల రూరల్: గ్రామ అభివృద్ధిలో ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న నిరుపేదలకు సహాయ సహకారాలందించటంలో కంభంపాడు గ్రామ జెడ్పీహెచ్ఎస్ పూర్వ విద్యార్థులు అందిస్తున్న సేవా గుణం అభినందనీయమని పంచాయతీ కార్యదర్శి బిట్టు వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం మండలంలోని కంభంపాడు గ్రామ జెడ్పీహెచ్ఎస్ పూర్వ విద్యార్థులు అనారోగ్యంతో మృతి చెందిన కుటుంబానికి ఆర్థిక సాయమందించారు. గ్రామానికి చెందిన కిన్నెర అబ్రహాం ఆర్థికంగా ఇబ్బంది పడుతూ క్యాన్సర్ వ్యాధితో మృతి చెందాడు. ఆ కుటుంబానికి పూర్వ విద్యార్థులంతా రూ.25 వేల నగదు అందించటం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

పెదకూరపాడు: పెదకూరపాడు ఎస్సీ కాలనీలో 166, 167 పోలింగ్ కేంద్రాలను తహసీల్దారు జె.ప్రభాకరరావు సోమవారం పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లో అవసరమైన సౌకర్యాలు కల్పించాలని వీఆర్వోలను ఆదేశించారు. సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా పోలింగ్ కేంద్రాలను సిద్ధం చేయాలని సూచించారు. ఇప్పటికే ఓటరు జాబితాను విడుదల చేశామన్నారు. ఎప్పుడు ఎన్నికలు వచ్చినా సమర్థంగా నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నామని ఆయన తెలిపారు. ఆయన వెంట వీఆర్వో నరసింహారావు ఉన్నారు.



ఆర్సీఎం పాఠశాలను పరిశీలిస్తున్న తహసీల్దారు ప్రభాకరరావు

వేసవిలో నీటి ఎద్దడి లేకుండా చర్యలు

జెడ్పీటీసీ తుమ్మా విజయప్రతాప్‌రెడ్డి

అచ్చంపేట: వేసవిలో గ్రామాల్లో నీటి ఎద్దడి తలెత్తకుండా అధికారులు చర్యలు చేపట్టాలని జెడ్పీటీసీ సభ్యుడు తుమ్మ విజయప్రతాప్‌రెడ్డి కోరారు. సోమవారం మండల ప్రజా పరిషత్ అభివృద్ధి కార్యాలయం సమావేశ హాలు జరిగిన సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ భూక్యా రజనీకృష్ణనాయక్ అధ్యక్షతన జెడ్పీటీసీ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. గ్రామాల్లో వేసవిలో ప్రజలు నీటి కోసం ఇబ్బందులు పడకుండా అధికారులు ఎప్పటికప్పుడు చర్యలు చేపట్టాలని కోరారు. చేతి పంపుల మరమ్మతుల విషయంలో మెకానిక్‌లు నిర్లక్ష్యం వహిస్తే.. అతని స్థానంలో మరొకరిని ఏర్పాటు చేసుకోవాలని కోరారు. ఎంపీపీ మాట్లాడుతూ అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కోరారు. ప్రజలు రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో స్వేచ్ఛగా, నిర్భయంగా ఓటు వేసే విధంగా అధికారులు తగు చర్యలు చేపట్టాలని కోరారు. ప్రభుత్వ పథకాలన్నీ ప్రజలకు అందేవిధంగా అవగాహన కల్పించాలని కోరారు. వివిధ శాఖల అధికారులు తమ తమ కార్యక్రమాల నివేదికలు సమర్పించటం జరిగింది. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జెడ్పీటీసీ తుమ్మ విజయప్రతాప్‌రెడ్డి

భక్తిశ్రద్ధలతో లక్ష్మీతిరుపతమ్మ గోపయ్య స్వామి పడిపూజ

క్రోసూరు: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో ఆదివారం సాయంత్రం జరిగిన లక్ష్మీ తిరుపతమ్మ గోపయ్య స్వామి మాలధారుల పడిపూజ భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెదకూరపాడు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు పాల్గొన్నారు. మాలధారులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అమ్మవారి దయవల్ల నియోజకవర్గంలో ప్రజలందరూ సుఖశాంతులతో, ఆయురారోగ్యాలతో, పాడిపంటలతో విరాజిల్లాలని కోరుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల నాయకులు కార్యకర్తలు, అభిమానులు, భక్తులు పాల్గొన్నారు.



పడిపూజలో ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

మొక్కపాడులో ఆరోగ్య శిబిరం

రాజుపాలెం: మొక్కపాడులో జ్వరాల నివారణకు ముదస్తుగా సోమవారం ఆరోగ్య శిబిరం నిర్వహించారు. 45 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. ముందుగా ఆరోగ్య సిబ్బంది ఇంటింటికి వెళ్లి జ్వర పరీక్షలు చేశారు. పీహెచ్‌సీ వైద్యాధికారి కేవీ కృష్ణకుమార్ సిబ్బందితో కలసి బజారుల వెంట కలయతిరిగారు. మురుగు కాలువల్లో ఎబెట్ పిచికారీ చేయించారు. నీరు నిల్వ ఉన్న తొట్లను పరిశీలించి, నీటిని తొలగించారు. కాచి చల్లార్చిన నీటిని తాగాలని స్థానికులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సత్తెనపల్లి మలేరియా సబ్ యూనిట్ అధికారి చంద్రశేఖర్, హెల్త్ సూపర్‌వైజర్‌లు జీవన్ రావు, రాజేష్‌పాల్, పంచాయతీ కార్యదర్శి విజయలక్ష్మి, ఆరోగ్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.



తొట్టి నీటిని తొలగిస్తున్న ఆరోగ్య సిబ్బంది

రోడ్డు భద్రతపై అవగాహన ఉండాలి

పెదకూరపాడు: యువకులు రోడ్డు భద్రతపై అవగాహన కలిగి ఉండాలని పెదకూరపాడు ఎస్సై వెంకట్రావు అన్నారు. 75 త్యాళ్లూరు గ్రామంలోని వివేకానంద హైస్కూల్‌లో సోమవారం రోడ్డు భద్రతపై అవగాహన సదస్సు నిర్వహించారు. డ్రైవింగ్ లైసెన్సు లేకుండా వాహనాలు నడపడం నేరమని విద్యార్థులకు వివరించారు. ప్రమాదాలు నివారించేందుకు ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతపై అవగాహన కలిగి ఉండాలన్నారు. నిబంధనల ప్రకారం వాహనాలు నడుపుతామని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు.

పరీక్ష సామగ్రి పంపిణీ

పెదకూరపాడు: మాగులూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో పెదకూరపాడులోని సెయింట్ ఆన్స్ ఇంగ్లీషు మీడియం పాఠశాల పదో తరగతి విద్యార్థులకు పరీక్ష సామగ్రిని మాగులూరి ఫౌండేషన్ నిర్వాహకులు మాగులూరి కృష్ణారావు, కుంచనపల్లి కిరణ్‌కుమార్, కొండవీటి ప్రసాద్ సోమవారం అందించారు.